# కులవ్యవస్థ - పౌరహక్కులు

కులాన్ని గురించి, కుల వ్యవస్థను గురించి ఈ రోజు సమాజంలో చాలా చర్చ జరుగుతున్నది.

నిన్నటి వరకు తమ జీవితాలను తాము శాసించుకునే హక్కు లేని దళితులు ఈ రోజు సమాజ జీవితాన్ని మేమే శాసిస్తామని ముందుకొస్తున్నారు. ఇది భారతదేశ చరిత్రలో ఒక మహత్తర ఘట్టం. అపూర్వ సందర్భం.

ఈ ఘట్టం అందరినీ కులవ్యవస్థ గురించి ఆలోచింపజేస్తున్నది. రాజకీయాలు, సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, ఒక్కొక్క జీవితరంగంలోనూ చర్చ జరుగుతున్నది.

కారంచేడు హత్యాకాండ జరిగిన నాటి నుండి కులానికీ పౌరహక్కులకూ ఉన్న సంబంధాన్ని గురించి పౌరహక్కుల ఉద్యమం ఆలోచిస్తూ ఉంది. దళితుల ఉద్యమాల నుండి, ఆకాంక్షల నుండి నేర్చుకుంటూ ఉంది. తన ఆచరణ ద్వారా దళిత ఉద్యమాలకు సహాయ సహకారాలు అందిస్తూ ఉంది. ఈ క్రమంలో తన అవగాహనను పెంచుకొంటూ ఉంది.

అగ్రకులాలకు చెందిన గ్రామీణ పెత్తందారీ మూకలు దళితులపైన దాడి చేసి గృహాలు దహనం చేసినప్పుడు, బరిసెలతో గొడ్డళ్లతో దళితులను పొడిచి నరికి పోగులు పెట్టినప్పుడు 'ఇది ఘోరం, అన్యాయం' అని అనుకోవడం, దోషులను శిక్షించడం కోసం కృషి చేయడం, న్యాయం కోసం జరిగే దళితుల ఉద్యమాలలో పాల్గొనడం ఒకెత్తు.

ఈ హింస వెనుక ఉన్న వ్యవస్థను, దాని నిర్మాణాన్నీ భావజాలాన్నీ గుర్తించడం ఇంకొకెత్తు. ఆ నిర్మాణం, భావజాలం నాశనం కానిదే ఈ దాడులు ఆగవని పౌరహక్కుల ఉద్యమం గుర్తించింది. కుల నిర్మూలనం జరగనిదే 'ప్రజాస్వామ్యం' అనే మాటకు భారత సమాజంలో నిండయిన అర్థం రాదని గుర్తించింది.

కారంచేడు చుండూరు వంటి దాడులు కులవ్యవస్థలో ఉండే భౌతిక దౌర్జన్యాన్నీ హింసనూ కళ్ళకు కట్టినట్టు చూపించాయి. ఆ హింస వెనుక దాగి ఉన్న అమానుషమయిన విషవ్యవస్థ పైన చర్చను ఆహ్వానించాయి.

మండల్ కమీషన్ ప్రతిపాదనలను అమలు చేస్తానని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పుడు కుల వ్యవస్థలోని భౌతిక హింసే కాక తాత్విక హింస కూడ బయటకు వచ్చింది. దళితులకు సంపూర్ణమయిన మనుషులుగా గుర్తింపు ఇవ్వని బ్రాహ్మణీయ సంస్కృతి కొత్త వివాదాలతో, ఆధునిక పరిభాషతో ముందుకొచ్చింది. భౌతిక దాడులనూ హింసనూ అరికడితే చాలదనీ సామాజిక నిర్మాణం, సంస్కృతి, భావజాలం తదితర రంగాలన్నిటిలోనూ కుల నిర్మూలన కోసం కృషి జరగకపోతే ఆ హింసకు పునాది అయిన వ్యవస్థ నాశనం కాదనీ 'మండల్' సంఘర్షణ స్పష్టంగా చూపించింది.

ఈ కృషి ఏ విధంగా జరగాలనే విషయంలో రాజకీయ విభేదాలుంటాయి. విభిన్న రాజకీయ సిద్ధాంతాల మధ్య ఘర్షణ ఉంటుంది. ఆధునిక కాలంలో ఈ కృషిని రాజకీయంగా చేపట్టిన పెరియార్, ఫూలె, అంబేద్కర్ వంటి వాళ్లు తమ సిద్ధాంత దృక్పథాన్ని ప్రతిపాదించారు. వాళ్ల ఆలోచనల ప్రేరణతో కృషి కొనసాగుతూ ఉంది. అందులో భాగంగానే ఈ రోజు బహుజన సమాజ్ పార్టీ ఒక కొత్త రాజకీయ శక్తిగా దేశ రాజకీయాలలో ముందుకు వచ్చింది. కానీ కుల నిర్మూలన గురించి ఇందుకు భిన్నమయిన ఆలోచనలు, సిద్ధాంతాలు ఉన్నాయి; ఉంటాయి.

ఈ వివిధ ఆలోచనల తప్పొప్పులను, సాధ్యాసాధ్యాలను బేరీజు వేయడం పౌరహక్కుల సంఘం ఉద్దేశ్యం కాదు. అయితే ఈ ఆలోచనల నేపథ్యంలో కుల నిర్మూలనను ఒక ప్రజాతంత్ర కర్తవ్యంగా గుర్తించి దాని ఆవశ్యకతను వివరంగా చర్చించవలసిన అవసరం ఉందని పౌరహక్కుల సంఘం భావిస్తూ ఉంది.

మనిషయి పుట్టిన కారణంగా ప్రతి ఒక్కరికి కొన్ని సహజ హక్కులుంటాయనేది ఒక బలమయిన ప్రజాతంత్ర భావన. ఏవి 'సహజ హక్కులు' అని నిర్వచించడంలో అభిప్రాయభేదాలకు తావు ఉన్నా ఈ భావన ప్రజాతంత్ర దృక్పథానికి కీలకమయినది. వర్ణ వ్యవస్థ, వర్ణ ధర్మం, బ్రాహ్మణీయ భావజాలం దీనికి బద్ధ శత్రువులు. అసలు వర్ణ ధర్మం ప్రకారం 'మనిషయి పుట్టడం' అనే మాటకే అర్థం లేదు. బ్రాహ్మణులుగా పుడతారు, శూద్రులుగా పుడతారు, అతి శూద్రులుగా పుడతారు. ఆడవాళ్ళుగా పుడతారు, మగవాళ్ళుగా పుడతారు. కాబట్టి పుట్టినందుకు ఎవరికీ సహజ హక్కులుండవు. సహజ ధర్మాలు మాత్రమే ఉంటాయి. ధర్మం అంటే పుట్టిన పుట్టుకను అనుసరించి జీవితాన్ని ఆచరించడం.

ఈ సహజ ధర్మాల సమాజం సమాన విలువ ఉన్న మనుషుల సమూహం కాదు. అదొక హెచ్చు తగ్గుల నిచ్చెన. నిచ్చెన కింద నుండి మీదికి, మీద నుండి కిందికి పోయే హక్కు, అవకాశం ఎవరికీ లేదు. మీది మెట్ల మీద ఉన్నవాళ్లకు పరపతి ఎక్కువ, అధికారం ఎక్కువ, అవకాశాలు ఎక్కువ. ఎంత మీదికి పోతే అంత ఎక్కువ. ఎంత కిందికి పోతే అంత తక్కువ. ప్రజాస్వామ్య భావనకు ఇంతకంటే పూర్తిగా విరుద్ధమయిన వ్యవస్థ వేరే ఏదీ ఉండదు. అందుకే దీనిని వ్యతిరేకించిన వాళ్లందరినీ పాశ్చాత్య దేశాల ప్రజాతంత్ర విప్లవంలో పుట్టిన 'సహజ హక్కుల' భావన ఆకర్షించింది. జ్యోతిబా ఫూలే థామస్ పెయిన్ ను ఉటంకించాడు. అంబేద్కర్ ఫ్రెంచి విప్లవ ఆశయం అయిన 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే లక్ష్యాన్ని ఉటంకించాడు.

వర్ణ ధర్మ నిచ్చెన వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల ఫలితంగా భారత రాజ్యాంగం దానిని నిషేధించింది. రాజ్యాంగ పరిషత్ డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడయిన అంబేద్కర్ దీని కోసం ప్రత్యేకంగా కృషి చేసాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 పరోక్షంగా కుల వ్యవస్థను నిషేధిస్తే, ఆర్టికల్స్ 15,16, 17 ప్రత్యక్షంగానే కుల నిషేధాన్ని ప్రస్తావించాయి. కులం ఫలితంగా పుట్టిన వివక్ష సంపూర్ణంగా పోయేటటువంటి సామాజిక వ్యవస్థ కోసం భారత ప్రభుత్వాల కృషి చేయాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు చెప్తాయి.

ఇదొక చెప్పుకోదగ్గ మార్పే.


అయినా సామాజిక ఆర్థిక రాజకీయ జీవితంలో కుల వ్యవస్థ, వర్ణ ధర్మం, సంస్కృతి ఈనాటికీ బలంగానే ఉన్నాయి. కారంచేడు చుండూరు వంటి దాడులు కేవలం రోగ లక్షణం మాత్రమే. సమాజంలో ఆస్తి, సంపద, అధికారం, హోదా, ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని రకాల పెద్దరికం, కొద్ది శాతంగా ఉన్న అగ్రకులాల చేతిలోనే ఉంది. ఈ వివక్ష ఉన్నంతకాలం సమాన అవకాశాలు అనే మాటకు అర్థం లేదు. భౌతిక జీవితంలో ఉన్న ఈ వివక్షకు తగిన భావజాలం, ఆలోచనలు, తాత్విక జీవితంలోనూ, సంస్కృతిలోనూ చాలా ప్రబలంగా ఉన్నాయి. ఈ రోజు అవన్నీ 'హిందూత్వం' అనే రాజకీయసిద్ధాంతంతో వర్ణ ధర్మ సంరక్షణ కోసం రాజకీయ పార్టీల రూపంలో, 'స్వయంసేవా' సంస్థల రూపంలో, ధర్మ సంసద్‌ల రూపంలో ముందుకొస్తున్నాయి. పైకి హిందూత్వం కేవలం మైనారిటీలకు శత్రువుగా కనిపించినా నిజానికి ఇది వర్ణ ధర్మ సంరక్షణ కోసం - అందులో భాగంగా దళితుల అణచివేత కోసం - ముందుకొస్తున్నదని స్పష్టంగానే ఉంది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ మధ్యంతర ఎన్నికలలో దళితుల స్పందనే ఈ విషయాన్ని రుజువు చేసింది.

జీవితంలోని అన్ని రంగాలలో అలుముకొనిపోయి ఉన్న కుల వ్యవస్థ సమూల నిర్మూలనం జరగనిదే భారత దేశాన్ని ఒక ప్రజాతంత్ర సమాజంగా మార్చే కృషి పరిపూర్ణం కాదు. ఆ ఆవశ్యకత గురించి, అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన, జరుగుతున్న ప్రయత్నాల గురించి చర్చించుకునేందుకే ఈ సదస్సు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

25-4-94

# కులవ్యవస్థ - పౌరహక్కులు



## భీమవరంలో రాష్ట్ర సదస్సు



**తేదీ : మే 7,8**

**స్థలం :**

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలు

టౌన్ రైల్వే స్టేషన్ ఎదురుగా, భీమవరం, ప.గో జిల్లా

### వక్తలు

ప్రొ. నందూరాం (ఢిల్లీ)

ప్రొ. ప్రేంపతి (ఢిల్లీ)

ప్రొ. రాంబాపట్ (బొంబాయి)

రవి కుమార్, మార్క్స్ (మద్రాసు)

సునీల్ దీఘె (బొంబాయి)

తదితరులు